ఆగస్టు 25, 26 తేదీలలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : వ్యవసాయ కార్మిక సంఘ ప్రథమ జిల్లా మహాసభలు నిర్వాహణకొరకు అంబేద్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెం జట్ల లేబర్ యూనియన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఆహ్వాన సంఘ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి మాజీ సభ్యులు దేవ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు. వ్యవసాయ కూలీల మెరుగైన జీవితం కోసం భారతీయ కేక్ మజ్దూర్ యూనియన్ బికెఎంయు అనేక పోరాటాలు చేసి ఎన్నో పథకాలు తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ కూలీలకు ఇళ్ళ పట్టాలు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు, గృహ నిర్మాణం, వృద్ధాప్య పింఛన్లు వంటి ఎన్నో అభివృద్ధి పనులను పోరాటాల ద్వారా సాధించిందన్నారు. వలస కూలీల నివారణకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ ప్రభుత్వహయాంలో తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిందని, ఈరోజు అనేకమంది వ్యవసాయ కూలీలు ఈ ఉపాధి హామీ పథకంలో జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ ఉపాధి హామీ కూలీల వేతనాలను పెంచాలని, పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. ఆగస్టు 25, 26 తేదీలలో రావులపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభలు జరపాలని నిర్ణయించారు. మొదటి రోజు వ్యవసాయ కార్మికులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, రెండవ రోజు జిల్లాలోని వివిధ మండలాల నుండి ఎన్నికైన ప్రతినిధుల సభ జరిపి వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని ఈ మహాసభ రూపొందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో మహాసభల ఆహ్వాన సంఘం ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కె రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రాము, సీలం వెంకటేష్, పుల్లెల ఆనంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

పల్లిపాలెంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ముమ్మిడివరం : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డు పల్లి పాలెం సచివాలయం వద్ద కమిష నర్ జి. లోవరాజు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్థానిక శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడేదని ఇప్పుడు నేరుగా మీ ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారని పేర్కొన్నారు. 1043 సర్టిఫికెట్లను దరఖాస్తు దారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కమిడిప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ రెడ్డి హేమ సుందరి శివన్నారాయణ, జడ్పిటిసి కుడుపూడి శంకర్రావు, తహశీల్దార్ చిక్కాల విజయశ్రీ, పి చిట్టిరాజు, టౌన్ అధ్యక్షులు బొంతు సత్య శ్రీనివాస్, కౌన్సిలర్స్, పార్టీ నాయకులు 2,3,7, వార్డుల ప్రజలు, వార్డు వాలంటీర్లు, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం

విశాలాంధ్ర - కిర్లంపూడి : వారాహి యాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఏలూరులో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాష్ట్రంలో ఉన్న వాలంటరీ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యల పట్ల బుధవారం కిర్లంపూడి వాలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నుండి ఏనుగు వీధి సెంటర్ వరకు ర్యాలీగా నిర్వహించి మానవహారం చేపట్టారు. పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. పవన్ కళ్యాణ్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని, భవిష్యత్తులో పవన్ కళ్యాణ్‌కు తగిన గుణపాఠం చెబుతామని వాలంటీర్లు హెచ్చరించారు.

భారీ వాహనాలతో కుంగిపోతున్న రోడ్డు

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలం మండపం గ్రామం నుండి శంఖవరం వెళ్లడానికి కోట్లాది రూపాయలతో నిర్మించిన రహదారి భారీ వాహనాల రాకపోకలతో కొన్నిచోట్ల తారు రోడ్డు దిగిపోతున్నది. మరికొన్నిచోట్ల సిమెంట్ రోడ్డు బీటలు వారింది. ఈ రహదారి గుండా రైతు ఉత్పత్తులైన టమోటాలు, వంకాయలు, ప్రత్తి, సర్వీస్ కర్ర, ధాన్యం, మామిడి, జీడి మామిడి తదితర పంటలు వివిధ మార్కెట్లకు తీసుకెళ్తుంటారు. అన్నవరం నుండి మండపం, శంఖవరం, పెదమల్లాపురం వరకు గ్రామ సచివాలయం ఉద్యోగులు, ప్రజలు నిత్యం ఈ రహదారిగుండానే ప్రయాణిస్తుంటారు. తొండంగి మండలం బెండపూడిలో గల ఆర్టీఏ చెక్ పోస్టును మస్కా కొట్టి భారీ ఇసుక లోడుతో వచ్చే భారీ టిప్పర్ లారీలు కత్తిపూడి, శంఖవరం మీదుగా మండపం గ్రామానికి చేరుకునే క్రమంలో అధికలోడుతో వెళుతున్న ఇసుక లారీల వలన రోడ్డు మొత్తం కొన్నిచోట్ల దిగిపోయి బీటలు వారింది. ఆర్టీఏ అధికారులు స్పందించి అధిక ఇసుకలోడుతో వెళుతున్న ఇసుక వాహనాలు నిరోధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రోటోకాల్ పాటించరా : ఎమ్మెల్యే చినరాజప్ప

విశాలాంధ్ర - సామర్లకోట : జగనన్నసురక్ష కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమమా లేక వైసిపి కార్యక్రమమా ప్రభుత్వ కార్యక్రమం అయితే స్థానిక శాసన సభ్యుడైన నా ఫోటో ఎక్కడని ప్రోటోకాల్ పాటించరా అని పెద్దాపురం నియోజకవర్గ శాసన సభ్యులు మాజీ ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మున్సిపల్ కమిషనర్ రామారావును నిలదీశారు. మరోసారి ఇలా జరిగితే ఫిర్యాదు చేస్తా నని హెచ్చరించారు. బుధవారం మునిసిపల్ కార్యాలయానికి ఎమ్మెల్యే చినరాజప్ప వచ్చి పట్టణంలో మంచినీరు కలుషితమైపోతుం దని నీళ్లలో మట్టి వస్తుందని శానిటేషన్ కూడా బాగోలేదని దీనిపై ఏమి చర్యలు తీసుకున్నారని మున్సిపల్ కమిషనర్, ఏఈ, డిఈలను రాజప్ప ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో అభివృద్ధిలోకి దూసుకుపోయిందని వివిధ రకాల ఫండ్స్ తెచ్చి అభివృద్ధి చేశామని వైసిపి పాలనలో చిన్న అభివృద్ధి కూడా జరగలేదని రాజప్ప అన్నారు. రాజప్ప వెంట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, మున్సిపల్ కౌన్సిలర్ బలుసు వాసు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు కంటే జగదీష్ మోహన్, బీసీ నాయకుడు గొల్తి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అధికారుల పనితీరుపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు

- గైర్హాజరైన వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తాం

- సర్వ సభ్య సమావేశంలో ఎంపిడివో బి.రామారావు

విశాలాంధ్ర - రాజానగరం : పలు శాఖల అధికారులు తమ పనితీరు మార్చుకోవాలంటు పలువురు ప్రజా పతినిధులు మండిపడ్డారు. మండల కేంద్రమైన రాజానగరంలోని ఎంపీడీవో కార్యాలయం హాలులో ఎంపీడీవో బి.రామారావు ఆధ్వర్యంలో ఎంపీపీ మండా రపు సితారత్నం వీర్రాజు అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడం, మొక్కుబడిగా క్రింది స్థాయి సిబ్బందిని పంపడంతో పలువురు ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.దీనిలో భాగంగా స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్య సదుపాయాలు సక్రమంగా అందడం లేదని గ్రామ సర్పంచ్ కొండేటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు ఎందుకు హాజరు కావడం లేదని మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న ప్రశ్నించారు. దీనిపై ఎంపిడివో రామారావు మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులకు నోటీసు జారీ చేస్తామన్నారు. . ఎంపీపీ మండా రపు సితారత్నం వీర్రాజు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చెయ్యాలని మండలాన్ని అభివృద్ధిలో తీసుకువెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కొల్లి సత్యవతి,గండి నాని బాబు,డిప్యూటీ తహశీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

భీమోలు పట్టాదారులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర- కొవ్వూరు : గోపాలపురం మండలం భీమవరం గ్రామ పంచాయతీకి చెందిన పట్టాదారులకు న్యాయం చేయాలని, కౌలుదారులకు అమ్ముడుపోతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా భీమోలు భూ సమస్యను పరిష్కారం చేయడంలో ప్రజా ప్రతినిధులు, రెవిన్యూ అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. పేద ప్రజలు సుప్రీంకోర్టుకు వెళ్లలేరని భావించి కొంతమంది కౌలుదారులు రాజకీయ నాయకులు కలిసి సుప్రీంకోర్టుకు వెళ్లారని ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని మధు తెలిపారు. పట్టాదారులు భూమిని సాగు చేసుకుంటున్నారని, మధ్యలో పోలీసులు జోక్యం చేసుకుని పట్టాదారులకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిపై ఆర్డీవో జోక్యం చేసుకుని గోపాలపురం ఎస్సై పై చర్యలు తీసుకోవాలన్నారు ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. కొండలరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తోట లక్ష్మణ్, వెంకట్రావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొవదయ్య తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు

విశాలాంధ్ర - కాకినాడ : దేశంలో విపత్తు నిర్వహణ రంగంలో విశేష సేవలందించిన సంస్థలు, వ్యక్తులకు గుర్తింపునిస్తూ సత్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023, ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని. ఆన్‌లైన్ దరఖాస్తు, ఇతర వివరాలు http://awards.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. వ్యక్తిగత, సంస్థల కేటగిరీల కింద దరఖాస్తు చేసుకోవచ్చని సంస్థ అవార్డుకు ఎంపికైతే రూ.51 లక్షలు, వ్యక్తిగతంగా అవార్డుకు ఎంపికైతే రూ.5 లక్షలు నగదు పురస్కారం లభిస్తుందని వివరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి అయిన 2024, జనవరి 23వ తేదీన మొత్తం మూడు నగదు అవార్డులను ప్రకటిస్తారని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు.

మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఏపీ మున్సిపల్ కమిషన్ అసోసియేషన్ వినతి

విశాలాంధ్ర - కాకినాడ : బుధవారం తాడేపల్లిలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఏపీ మున్సిపల్ కమిషన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కలి శారు. వివిధ సమస్యలపై వినతి పత్రం అందించారు. అబ్సర్షన్ పోస్టులు జరగకుండా చూడాలని, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో కమిషనర్లకి క్యాడర్ పోస్టులుగా అవకాశమిచ్చి పరిగణించాలని, డెప్యూటేషన్ పోస్టులు రద్దు చేయాలని, జిల్లాలో పిడి మెప్మా అధికారులను కమిషనర్లుగా భర్తీ చేయాలని, పిడి మెప్మా పోస్టులు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మున్సిపల్ కమిషనర్లుగా భర్తీ చేయాలని, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో వైస్ చైర్మన్, సెక్రటరీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు కమిషనర్లతోనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మరికొన్ని సందర్భాల్లో మదర్ డిపార్ట్‌మెంట్‌లోని ఇంటర్న్ అధికారులు అవకాశాలను కోల్పోతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంకు ఏపీ మున్సిపల్ కమిషనర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ నాగనరసింహారావు, ప్రధాన కార్యదర్శి బి. బాలస్వామి, కోశాధికారిగా బి. శివారెడ్డి ట్రెజరర్, ఎం. ఏసుబాబు ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎన్ అమరయ్య జాయింట్ సెక్రెటరీ, కేవిఆర్ఆర్ రాజు, ఏ దాడ భాష, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు హాజరయ్యారు.

విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం పెంపొందించాలి

విశాలాంధ్ర - గోపాలపురం : విద్యార్థులలో ప్రతిభా పాఠవాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్, ఎంఐసి కోఆర్డినేటర్ నరసింహారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని వేల చింతలగూడెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక కిట్లు తదితర కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులలోని సామర్థ్యాలను విద్యార్థులను నిర్వహించే వర్క్ బుక్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులను మెరుగు చేసి కార్పొరేట్ విద్యా అందించడమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. డ్రాప్ అవుట్ ల శాతం లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నమని, శ్రీలక్ష్మి సిఆర్‌పి నాగరాజు పాల్గొన్నారు.

ఉప్పాడ తీరంలో సముద్రపు కవచ్

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : సముద్రంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి గానీ, మెరైన్ పోలీసు అధికారులకు గానీ సమాచారం ఇవ్వాలని, యు కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు మత్స్యకారులను కోరారు. బుధవారం ఆయన పోలీస్, మెరైన్ పోలీసు అధికారుల ఆధ్వర్యంలో సముద్ర తీరంలో నిర్వహిస్తున్న గస్తీ(ఆపరేషన్ కవచ్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామలింగేశ్వర రావు మాట్లాడుతూ, సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు తీరంలోకి ప్రవేశించి అల్లర్లు సృష్టించే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారం మేరకు తీర ప్రాంతంలో నిఘాను ముమ్మరం చేసినట్లు తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్ళే మత్స్యకారులకు అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

సత్రం భూములు కౌలుకు బహిరంగ వేలం

కిర్లంపూడి గ్రామంలోగల KRSP సంస్థలకు చెందిన ఈ దిగువ ఉదహరించిన భూములు ది. 2023-24 నుండి 2025-26 వరకు 3 సంవత్సరాలు కాల పరిమితికి ది. 29/7/2023 తేది శనివారం ఉదయం 10 గంటలకు సత్రంవద్ద కౌలుకు సాగుచేసుకొనుటకు బహిరంగ వేలం జరుపబడును.

శ్రీ KRSP జనరల్ సత్రంనకు చెందిన భూమి
i) సర్వే నెం - 418 -య-11-82 సెం॥లు
ii) ″ - 409 -య-11-62 సెం॥లు
iii) ″ - 402/2-య-00-74-సెం॥లు
″ - 401/3-య-02-06-సెం॥లు
″ - 399 -య-02-10-సెం॥లు
″ - 140/2-య-00-53-సెం॥లు
05-43

iv) శ్రీ KRSP ఎడ్యుకేషనల్ ట్రస్టునకు చెందిన భూమి
సర్వే నెం - 410/3 -య-00-13 సెం॥లు
సర్వే నెం - 410/2 -య-00-22 సెం॥లు
సర్వే నెం - 398 -య-05-52 సెం॥లు
సర్వే నెం - 410/1 -య-05-89 సెం॥లు
11-76

v) శ్రీ KRSP శ్రీరామ అన్నసత్రంనకు చెందిన భూమి
సర్వే నెం - 391 -య-04-06 సెం॥లు
సర్వే నెం - 392/1 -య-03-81 సెం॥లు
సర్వే నెం - 392/2 -య-00-05 సెం॥లు
07-92

పై సంస్థలకు చెందిన '5' ప్లాటులను ఆశక్తి గల వారు రూ. 5000/-లు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పొల్గనవచ్చును. మిగిలిన వివరములు సంస్థ ఫౌండరు ట్రస్టీ వార్ని అడిగి తెలుసుకొనవచ్చును.

కిర్లంపూడి
తేది.12-07-2023

ఇట్లు
వ్యవస్థాపక ధర్మకర్త

పుష్కర కాలువపై వంతెన ప్రారంభం

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : పుష్కర కాలువపై వంతెన ఏర్పాటుతో నీలాద్రిరావుపేట బీసీ కాలనీ వాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. జగ్గంపేట నియోజకవర్గం పరిధిలో గండేపల్లి మండలం, నీలాద్రి రావుపేట గ్రామంలో పుష్కర కాలువపై ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ. 48.50 లక్షలతో నిర్మించిన వంతెనను కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఆసుపత్రికి వెళ్లాలంటే ఎంతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉండేదని.. ఇప్పుడు ఈ వంతెన ప్రారంభంతో అలాంటి బాధలు తప్పాయన్నారు. జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా మాట్లాడుతూ రూ. 48.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో వంతెన ఏర్పాటు చేయడం జరిగిందని..ఇంకా ఏమైనా నిధులు అవసరమైతే ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ అంబులెన్స్ రావడానికి కూడా దారిలేని పరిస్థితి ఉండేదని..ఇప్పుడు ఈ వంతెన ఏర్పాటుతో బీసీ కాలనీ వాసుల కష్టాలు తీరాయని పేర్కొన్నారు. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ వంతెన లేక నీలాద్రిరావుపేట బీసీ కాలనీ వాసులు చాలా ఇబ్బందులు పడ్డారని.. ఈ రోజు వంతెన ఏర్పాటవడం చాలా ఆనందం కలిగిస్తోందని పేర్కొన్నారు.

నూతన గ్రామ సచివాలయ ప్రారంభోత్సవం : గండేపల్లి మండలం, నీలాద్రిరావుపేటలో గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతా, జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా, కాకినాడ గ్రామీణ నియోజకవర్గం శాసనసభ్యులు కురసాల కన్నబాబు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. అనంతరం నీలాద్రిరావుపేటలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, గండేపల్లి మండలం ఎంపీపీ చలగల దొరబాబు, జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, పెద్దాపురం ఆర్‌డీవో జె.సీతారామారావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకట రామన్, ఓఎన్‌జీసీ కాకినాడ హెడ్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - గోపాలపురం : దీర్ఘకాలిక ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. బుధవారం మండలంలోని కరగ పాడు గ్రామంలో జగనన్న సురక్ష అవగాహన సదస్సు సర్పంచి బొమ్మిన నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పరిష్కారం కాని ఫిర్యాదులతో పాటు గ్రామాలలో ప్రజలకు అందవలసిన సంక్షేమ పథకాలను తక్షణమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకులపాటి లలిత, నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఎండపల్లి కవిత, వైకాపా నాయకులు పోతిరెడ్డి నాగరాజు, ఇళ్ల భాస్కరరావు, బొమ్మిన నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

బిక్కిన కుటుంబానికి ఎమ్మెల్సీ తోట పరామర్శ

విశాలాంధ్ర - మండపేట : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు బిక్కిన తాతబ్బాయి చౌదరి(బీటీ చౌదరి) మాతృమూర్తి కల్పన ఇటీవల మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. బుధవారం సుబ్బారాయుడు మెమోరియల్ నర్సింగ్ హెూమ్‌కు వెళ్ళి బీటీ చౌదరి కుటుంబ సభ్యులను పలకరించారు. కుటుంబ సభ్యులైన చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, బిక్కిన వెంకట్రావు, రెడ్డి రాధాకృష్ణలతో మాట్లాడి కల్పన మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్సీపీ నాయకులు గారపాటి అశోక్, పిల్లా వీరబాబు, మీగడ శ్రీనివాస్, పెంకే గంగాధర్ తదితరులున్నారు.

మండపేటలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - మండపేట : స్థానిక 12, 13 వార్డులకు సంబంధించి స్థానిక సీతారామ కమ్యూనిటీ హాలులో వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు, కౌన్సిలర్ మలసాని సీతా మహాలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన సురక్ష సభలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జగనన్న సురక్షలో అపరిష్కృతంగా ఉన్న అనేక ప్రజల సమస్యలు పరిష్కార మవుతున్నాయని తప్పకుండా సురక్ష సేవలు ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి మాట్లాడుతూ జగన్ ఆశయాలు మేరకు ప్రజల కోసం ఎంతో కష్టపడి పని చేస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధించాయన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ సురక్ష సేవల ద్వారా మండపేట పట్టణంలో 19 వేల మందికి సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేగుళ్ల నారాయణరావు, వైఎస్సార్సీపీ మహిళా నాయకురాలు ఓగిరాల దేవి తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహ జ్వాలలు

విశాలాంధ్ర - అమలాపురం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు అమలాపురం పట్టణంలో 22వ వార్డు కౌన్సిలర్ గోవ్వాల రాజేష్ ఆధ్వర్యంలో వలంటీర్లు తీవ్ర నిరసన తెలిపారు. పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ వాలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టి బొమ్మ దగ్ధం చేసారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

విద్యతోనే పేదరికం నిర్మూలన

విశాలాంధ్ర - రాజానగరం : విద్యతోనే పేదరికం పూర్తి స్థాయిలో నిర్మూలన అవుతుందని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల-2 నందు సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 90 మంది విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించే పాఠ్యాంశాలు వ్రాసుకునేందుకు అవసరమైన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు విద్యపై మక్కువతో చదువుకోవాలని చెప్పారు. చిన్నప్పటి నుండే కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలని, పాఠ్యాంశాల్లో వచ్చే సందేశాలను ఉపాధ్యాయులను ఎప్పటికప్పుడు అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సుంకర నాగేశ్వరరావు,ప్రధానోపాధ్యాయురాలు సునీత, టీచర్స్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - అనపర్తి : శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం, లైఫ్ స్కిల్స్ పై విద్యార్థులు దృష్టి సారించాలని డాక్టర్ తేతలి రామారెడ్డి సూచించారు. స్థానిక జిబిఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థుల మానసిక ఒత్తిడి పై అవగాహన సదస్సు నిర్వహించారు. డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం లో భాగంగా డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ తొలి దశలోనే ఒత్తిడిని గుర్తించకపోతే ఎఫీషియన్సీ తగ్గి తర్వాత దశలో మానసిక రుగ్మతలకు దారితీస్తుందని తెలిపారు. అదేవిధంగా శారీరక వ్యాయామం, ధ్యానం, యోగా ద్వారా ఒత్తిడిని జయించవచ్చని తీవ్ర ఒత్తిడి ఉన్న సందర్భాల్లో వైద్య నిపుణుల సలహాలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్, డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్స్ పిఆర్ఎల్ స్వామి, నల్లమిల్లి పెద్ద అబ్బాయి రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పీవీ వెంకటేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లు వాస్తవాలను గ్రహించాలి

విశాలాంధ్ర-గోకవరం: వాలంటరీ వ్యవస్థను జనసేన ఎప్పుడు తప్పు పట్ట లేదని అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్న వాలంటీర్లకు జనసేన పార్టీ ఎప్పుడూ అండగానే ఉంటుందని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి దోసపాటి సుబ్బారావు అన్నారు. గోకవరం మండలంలో స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ సక్రమంగా ఉన్నా అక్కడక్కడ కొంతమంది కావాలని తప్పుడు మార్గాలు ఎన్నుకొని చేస్తున్నారని అటువంటి వాళ్లను ఉద్దేశించి మాత్రమే పవన్ కళ్యాణ్ మాట్లాడారని దీనిని భూతద్దంలో చూపించి రాద్ధాంతం చేయడం తగదని అంటూ కొంతమంది అవినీతి కార్యక్రమాలకు పాల్పడిన వాలంటీర్ల సంబంధించి పేపర్ క్లిప్పింగ్ ఆయన మీడియాకు చూపించారు. జనసేన పార్టీ వీర మహిళ, గంగంపాలెం గ్రామపంచాయతీ ఒకటవ వార్డు మెంబర్ కుంచే లక్ష్మి, గోకవరం మండల గౌరవ అధ్యక్షులు గాజింగం నాని, రైతు విభాగపు అధ్యక్షులు ప్రగడ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం మండలంలో గ్రామ స్థాయిలో జనసేన బలోపేతానికి కృషి చేయాలని రాజానగరం నియోజకవర్గ జనసేన నాయకుడు బత్తుల బలరామకృషణ అన్నారు. బుదవారం సీతానగరం గ్రామంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న వైసీపీ ప్రజల దృష్టి మళ్లించేందుకే వాలంటీర్లను రెచ్చగొడుతుంది అని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రణాళిక బద్ధంగా పార్టీని క్షేత్రస్థాయిలో అభివృద్ధి పరచడం వంటి విషయాలపై జనశ్రేణులకు దశాదిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి వెంకటలక్ష్మి, మండలంలోని జనసేన సీనియర్ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

గుంతల సమస్యలు పట్టవా?

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం అంటూ టీడీపీ నాయకులు తాళ్ళపూడి మెయిన్ రోడ్ లో గల ఆర్ అండ్ బి రోడ్డు గుంతలు గురించి విమర్శించారు. టీడీపీ నాయకులు చేపట్టిన పాదయాత్ర ఈ గుంతలు మీదనుంచి సాగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాం లో పలు విషయాలను టీడీపీ లోపాలుగా పేర్కొంటూ హడావిడి చేసిన ప్రస్తుత కొవ్వూరు వైకాపా నాయకులకు, పాలకులకు తాళ్ళపూడిలో రహదారుల సమస్యలు పట్టవా అని టీడీపీ నాయకులు వట్టికుటి వెంకటేశ్వరరావు విమర్శించారు. బటన్ నొక్కటం తప్ప ప్రజల సమస్యలు పట్టవా అంటూ విమర్శించారు. అభివృద్ధి జరగాలంటే తిరిగి టీడీపీ పరిపాలన రావాల్సిందేనని అన్నారు.

దేవ ముసలయ్య జీవితం ఆదర్శనీయం

ఆరో వర్ధంతి సభలో రామ్ ప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ: కమ్యూనిస్టు సీనియర్ నేత దేవ ముసలయ్య జీవితం యువతకు ఆదర్శమని ప్రముఖ న్యాయవాది రామ్ ప్రసాద్ అన్నారు. పాత తూర్పుగోదావరి జిల్లా దిండి గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు దేవ ముసలయ్య 6వ వర్ధంతి సభ బుధవారం విజయవాడలోని వెన్నెల స్కాన్ సెంటర్‌లో జరిగింది. సభకు డా.సదానందం అధ్యక్షత వహించారు. డా.సుజాత ముందుగా దేవ ముసలయ్య ఉద్యమ జీవితం, కుటుంబానికి, సమాజానికి, పార్టీకి చేసిన సేవను వివరించారు. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ దేవ ముసలయ్య జీవితం యువతరానికి ఆదర్శప్రాయమన్నారు. పార్టీ నిర్బంధ కాలంలో 14 ఏళ్ల వయస్సులోనే ఆయన జైలు జీవితం గడపవలసి వచ్చిందన్నారు. ఆ సమయంలోనే సాహిత్యం బాగా చదివి దేశసేవకు అంకితం కావాలని నిర్ణయించుకున్నారన్నారు. తనలానే తన కుటుంబం కూడా సమాజానికి, దేశానికి సేవచేయాలని ప్రోత్సహించారన్నారు. ఇటీవల మరణించిన దేవ మంగాయమ్మ ముసలయ్య అడుగుజాడల్లో నడిచి తమ శాయశక్తులా సమాజసేవ చేశారన్నారు. కుమార్తె డా.సుజాత, కుమారులు దేవ రాజేంద్రప్రసాద్, దేవ రాధాకృష్ణ కూడా తల్లిదండ్రులు బాటనే నడుస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సీనియర్ కమ్యూనిస్టు నేతలు కోటేశ్వరరావు, వర్మ తదితరులు ప్రసంగిస్తూ ముసలయ్యకి నివాళులు అర్పించారు. సభలో సత్యనారాయణ, విజయలక్ష్మీ, మున్నీ, లక్ష్మీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి

విశాలాంధ్ర - గణపవరం: రైతులు వరి సాగులో ఎరువులు వినియోగం పురుగు మందులు పిచికారి చేయడం తగ్గించి దిగుబడులను పెంచుకోవాలని తాడేపల్లి గూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి. మురళీకృష్ణ అన్నారు. గణపవరం మండలం అప్పన్నపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమం, గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నక్క సూరిబంగారి అధ్యక్షతన జరిగింది. మండల వ్యవసాయ అధికారి యర్రశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు మొదలగు విషయాలు గురించి వివరించారు. రైతులు ఆరోగ్యవంతమైన నారుమడి పెంచాలని, వరి పైరును ప్రతిరోజు పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూకారపు సుధాకర్ రావు, వ్యవసాయశాఖ వి ఏ ఏ లు, రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాలంటీర్లకు సత్కారం చేసిన యడ్ల తాతాజీ

విశాలాంధ్ర - పాలకొల్లు: డిసిఎంఎస్ మాజీ చైర్మన్, సీనియర్ వైసిపి నాయకుడు యడ్ల తాతాజీ ఆధ్వర్యంలో పాలకొల్లులో, వాలంటీర్లకు బుధవారం ఘన సత్కారం చేశారు. శాలువా కప్పి పూలమాల వేసి సత్కరించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను తాతాజీ ఖండించారు. పాలకొల్లులోని యడ్ల తాతాజీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు .

రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులు చేపట్టాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు రైల్వే గేట్ మూసివేతను ఆపివేయాలనీ, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చేపట్ట వలసిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ శివేంద్ర మోహన్ కు వినతిపత్రం సమర్పించారు. పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, డిఆర్ యుసిసి సభ్యులు జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి యాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర -తణుకు : పట్టణంలో ఈ నెల 14 న జరగబోవు వారాహి యాత్రకు నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జనసేనపార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు పిలుపునిచ్చారు. మండపాకలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసమావేశంలో విడివాడ పాల్గొని మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈనెల 14న తణుకు భారీ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు . రెండో దశ వారాహి యాత్రలో భాగంగా జిల్లాలో కొనసాగుతున్న పర్యటనలో భాగంగా ఈ నెల 13న తాడేపల్లిగూడెం నుంచి తణుకు చేరుకుంటారన్నారు . రాత్రికి తణుకులోనే పవన్ కళ్యాణ్ బస చేస్తారని తెలిపారు . అదే రోజు సాయంత్రం నియోజకవర్గ పార్టీ నాయకులు, వీర మహిళలతో సమావేశం నిర్వహిస్తారన్నారు. 14వ తేదీ సాయంత్రం పైడిపర్రు సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పవన్కళ్యాణ్ పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ తణుకు మండలం అధ్యక్షులు చిక్కాల వేణు, తణుకు మండలం ఉపాధ్యక్షురాలు తెలగరెడ్డి లక్ష్మి, తణుకు టౌన్ ప్రెసిడెంట్ గర్రె తులసిరామ్, ఇరగవరం మండలం అధ్యక్షులు ఆకేటి కాశీ, విశాలి నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధి చిన్నారులకు రక్తమార్పిడి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో 12 మంది తలసీమియా వ్యాధి చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన జిల్లాలోనే కాకుండా చుట్టుపక్కల ఉన్న జిల్లాల నుంచి కూడా తల సేమియా వ్యాధి పిల్లలు రక్తమార్పిడిని చేయించుకోవడానికి రెడ్ క్రాస్ భవనానికి వస్తున్నారని, వారందరికీ కూడా తగిన రక్త యూనిట్లను సమకూర్చడం కష్టతరమవుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా విరివిరిగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి తల సేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. బుధవారం తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి మధ్యాహ్నం ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత విశ్రాంత ఉపాధ్యాయుని నాగుల బేబీ సరోజినీకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ , డాక్టర్ ఆర్ ఎస్ ఆర్ కే వరప్రసాదరావు, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, కోనేరు రవీంద్ర, ఎన్ బేబీ సరోజినీ, పైడి కస్తూరిబాయి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామ అభివృద్ధి

విశాలాంధ్ర-పెదవేగి: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు ఎంతో అవసరమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం పెదవేగి మండలంలోని జగన్నాథపురం గ్రామంలో కోర్టేవా అగ్రి సైన్స్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టేవా అగ్రి సైన్స్ మొక్కజొన్న కంపెనీ మండల పరిధిలోని గ్రామాలలో రైతులకు మొక్కజొన్న సీడ్ అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, దీంతోపాటు అనేక సేవా కార్యక్రమంలో పాల్గొని గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య కుమార్, ఎంపీటీసీ రాచప్రోలు చంద్రరావు, గ్రామ సర్పంచి మాత్రపు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఆందోళన... పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలు దగ్ధం

విశాలాంధ్ర-భీమడోలు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చంద్రబాబు నియమించిన వాలంటీర్ అని, తాము ప్రజా శ్రేయస్సుకు పనిచేస్తే పవన్ చంద్రబాబు కోసం కృషిచేస్తున్నారని ఏలూరు జిల్లా భీమడోలులో వాలంటీర్లు కదంతొక్కారు. పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన ఆరోపణలను నిరసిస్తూ భీమడోలు జంక్షన్ లో వాలంటీర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నల్లరిబ్బన్లు ధరించి, పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించారు. తక్షణం అయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ ఫోటోని దహనం చేసారు. సేవాతత్వంతో తాము వాలంటీర్ విధులు నిర్వహిస్తుంటే జనసేన అధినేత పవన్ తమపై నిరాధార ఆరోపణలు బాధిస్తున్నాయని మహిళా వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణం పవన్ వాలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు.

పవన్ కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని వాలంటీర్లు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాచన్నగూడెం సచివాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వాలంటీర్లు, నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లు అందరూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరోనాకాలంలో ప్రజలకు ఎంతో సేవ చేశామని జీవనభృతి కోసం వాలంటీర్లుగా పనిచేస్తుంటే పవన్ కళ్యాణ్ మాపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎం వసంతరావు, ఎంపీపీ కోర్స పోచమ్మ, సచివాలయ మండల కన్వీనర్ వనమా రామకృష్ణ, సర్పంచ్ సున్నం వరలక్ష్మి,పార్టీ సీనియర్ నాయకులు చందా ప్రసాద్, వీరంకి వెంకటేశ్వరరావు, చిట్టి బొమ్మ శ్రీనివాస్, ఉప్పల రాంపండు, ప్రసాద రెడ్డి, బాబురావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టీడీఆర్ బాండ్లు జారీ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: పురపాలక సంఘంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టిడిఆర్ బాండ్లు జారీ చేయడం జరిగిందని ఇందులో ఎటువంటి గోల్ మాల్ జరగలేదని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులో కమిషనర్ చాంబర్లో బుధవారం టి పి ఓ కే హరిప్రసాద్ తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో కమిషనర్ సామ్యూల్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి స్థానిక భీమవరం రోడ్లో ఉన్నటువంటి తొమ్మిది టిడిఆర్ బాండ్లు జారీ చేసి పురపాలక సంఘానికి అప్పగించిన స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ బాండ్లు జారీ చేయడంలో అవలంబించిన విధానాన్ని కూడా పరిశీలించానని కమిషనర్ పేర్కొన్నారు. భీమవరం రోడ్డు మాస్టర్ ప్లాన్ లో వంద అడుగులుగా 1988లో డిటిసిపి అప్రూవల్ పొందింది అన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు 80 అడుగులు ఉందన్నారు. మిగిలిన 20 అడుగులు విస్తరణ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తాడేపల్లిగూడెం రోజు రోజుకి అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా రోడ్డు విస్తరణ చేయవలసిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కారణంగా భీమవరం రోడ్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారికి టిడిఆర్ బాండ్లు ఇవ్వడం జరిగిందని కమిషనర్ స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఇప్పటి వరకు 9 టీడీఆర్ బాండ్లు జారీ చేసి వారి స్థలాన్ని సబ్ రిజిస్టర్ ద్వారా పురపాలక సంఘానికి రిజిస్టర్ చేసి ఇవ్వడం జరిగిందన్నారు. వాటిని తాను వ్యక్తిగతంగా పరిశీలించగా 5 పూర్తిగా ఖాళీ స్థలాలుగా ఉన్నాయని వారు అప్పగించిన స్థలానికి మార్కింగ్ చేసి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందిని నోటీసు బోర్డులు ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించినట్లు కమిషనర్ తెలియజేశారు. మిగిలిన నాలుగులో రెండు ప్లాన్లు అనుమతి పొంది మున్సిపల్ స్థలం వదిలి భవన నిర్మాణం చేస్తున్నారన్నారు. మిగిలిన ఒకదానిలో నిరుపయోగంగా ఉన్న థియేటర్ ప్రహరీ గోడ ఉందన్నారు. సంబంధిత యజమానిని సంప్రదించగా ఆ ప్రహరీ గోడను 15 రోజులు వ్యవధిలో తొలగిస్తామని లిఖితపూర్వకంగా తమకు తెలియజేశారన్నారు. దీంతో పురపాలక సిబ్బంది ఆ గోడకు పెగ్ మార్కింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయాలు గమనించాలని టి డి ఆర్ బాండ్లు జారీలో ఎలాంటి గోల్ మాల్ జరగలేదని అంతా ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ వివరించారు.

సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎంపీపీ కోర్స పోచమ్మ అన్నారు. బుధవారం రాచన్నగూడెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ మండల కన్వీనర్ వనమ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పోచమ్మ మాట్లాడుతూ ఎన్నికల హామీలు 100 పూర్తి చేయడానికి ఈ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ పథకాల అమలును చూసి రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపికి మద్దతు ఇవ్వాలన్నారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మల్లం వసంతరావు, సర్పంచి సున్నం వరలక్ష్మి, ఎంపీటీసీ ఉదయ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు చందా ప్రసాదు, ఎంపీడీవో కే కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ జి. సుందర్ సింగ్, నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు, ఉప్పల రాంపండు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-టి నరసాపురం: పవన్ కళ్యాణ్ మాటలను వక్రీకరించడం తగదని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు తెలిపారు. మండలకేంద్రమైన టి నరసాపురంలోని అంబేద్కర్ సెంటర్లో పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి జనసేన నాయకులు బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వాలంటీర్ల కు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు ఆయన దిష్టి బొమ్మ దగ్ధం చేయడం భాదాకరం అన్నారు. దిష్టి బొమ్మ దగ్ధం చేసిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో కడిగి పవన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్యాహ్నపు చిన పెంటారావు, సిహెచ్ నవీన్, పాలేటి సత్యనారాయణ, ఆళ్ల బాలాజీ, దొరబాబు, మంద్రు రాంబాబు, కంపసాటి రమేష్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో గొలుసు చోరీ

విశాలాంధ్ర- ముసునూరు: పట్టపగలే ఓ మహిళ పశువుల్ని తోలుకెళ్తున్న సమయంలో ఆమె మెడలోని బంగారం గొలుసును దొంగలు అపహరించారు. మండలంలోని బలివే గ్రామ శివారు వెంకటాపురం గ్రామానికి చెందిన భువనేశ్వరి తమ పొలంలోకి ఆమెకు చెందిన పశువులను మేత కోసం తోలుకెళుతుండగా,బైకు పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె చీరతో నోరు కట్టి మూడు కాసుల బంగారంగొలుసు అపహరించారు. ఆమె ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,ఎస్ఐ యం.కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువగళం పాదయాత్రతో వైసీపీలో వణుకు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: యువగళం పాదయాత్రతో వైసీపీలో వణుకు పుడుతోందని టిడిపి కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. యువగళం పాదయాత్ర 2000 కిలో మీటర్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె స్వగృహంలో ముందుగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ లోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారాపార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింప టంతో పాటుముఖ్య మంత్రి జగన్ అవినీతి, అక్రమ పాలనను ఎండ గడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ నుంచిస్థానిక ప్రజా ప్రతినిధుల వరకు దోచుకోదాచుకో అన్న చందంగా పరిపాలన సాగిస్తున్నారన్నారని అన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: ఈనెల 15వ తేదీన నరసాపురం నియోజకవర్గం నుండి ప్రారంభం కానున్న భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్రను జయప్రదం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ అన్నారు. బుధవారం భీమవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బస్సు యాత్ర ఆచంట, పాలకొల్లు, భీమవరం నియోజకవర్గాల మీదుగా సాగి 19వ తేదీన తాడేపల్లిగూడెంలో ముగుస్తుందని నాయకులు, కార్యకర్తలు బస్సు యాత్రను జయప్రదం చేయాలన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ వాలంటీర్లు పార్టీలకు అతీతంగా పనిచేయాలని కోరారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పాలకొల్లు శాసనసభ్యుడు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వైసిపి నకిలీ రత్నాలతో మోసపోయిన ప్రజానీకంలోని రైతులు విద్యార్థులు గృహిణులు ఎక్కువ శాతం మంది రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్రలలో పాల్గొంటున్నారని అన్నారు. ఉండి శాసనసభ్యుడు మంతెన రామరాజు మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా జగన్ ప్రకటించిన అమ్మఒడి పథకం ద్వారా ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉన్నా అమ్మఒడి అందిస్తామని తెలిపి అధికారంలోకి వచ్చాక మాట మార్చి మడం తిప్పారన్నారు. సమావేశంలో నరసాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామాంజనేయరాజు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లికార్జునరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కాలంతోపాటు ఆలోచన విధానంలో మార్పు

విశాలాంధ్ర - అనపర్తి : కాలంతోపాటు మనిషి ఆలోచన విధానం, శుభ్రత విషయంలో మార్పు రావడం జరిగిందని ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక తేతలి రామిరెడ్డి మంగయ్యమ్మ కళా వేదిక ఆవరణలో త్రివిస్టా ప్రొడక్ట్స్ లాంచ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణ రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి, డాక్టర్లు కె.వి కృష్ణారెడ్డి, సునీల్ రెడ్డి, రమాదేవి, పారిశ్రామికవేత్త సత్తి లక్ష్మణ్ రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షులు సత్తి వెంకట రామారెడ్డి, తేతలి త్రినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తుకు గ్యారంటీ

విశాలాంధ్ర- గోకవరం : కొత్తపల్లి గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ.. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన మేనిఫెస్టోని ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నెహ్రూ ప్రజలకు వివరిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు 59 సంవత్సరాలు వచ్చేవరకు నెలకు 1500 రూపాయలు ఇవ్వబడునని కుటుంబంలో చదువుతున్న పిల్లలు ఎంతమంది ఉన్నా వారందరికీ సంవత్సరానికి 15000 రూపాయలు ఇస్తామని తెలియజేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించబడనని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అడపా భరత్ బాబు, గ్రామ అధ్యక్షులు దిండి రాజు, యూనిట్ ఇంచార్జ్ సున్నం రాంబాబు, రామిశెట్టి సత్యనారాయణ,అడబాల సింగరయ్య, బయ్యపు సురేష్,సున్నం దుర్గ,రాపాక లక్ష్మి, చెక్క మరియమ్మ, మండిగ గంగాధర్, మండిగ బాలాజీ, కొంగరపు రాజు,దుర్గారావు, బలస సునీల్,సూర్య ప్రకాశ్ రావు, రాజారెడ్డి, ఈశ్వరరావు,రఘు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా శాఖ కార్యాలయం ఏర్పాటు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం యర్రమిల్లి వారి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ జిల్లా శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ప్రారంభించారు. కార్యాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి చిట్టిబాబు, మోకా వెంకట సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, ఆర్వీ నాయుడు కొండేటి ఈశ్వర గౌడ్, నక్కా త్రిలోచనరావు, పాలూరి సత్యానందం, దూరి రాజేష్, నల్లా పవన్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలో రహదారిని నిర్మించండి మహా ప్రభో!

విశాలాంధ్ర-ఉండి: తమ కాలనీలలో రహదారులను నిర్మించాలని ఉండి మండలం పెదపుల్లేరు గ్రామానికి చెందిన తూర్పు కాలనీవాసులు కాలనీలోని బురద నీటిలో మంగళవారం తమ నిరసనను తెలియపరిచారు. ఈ సందర్భంగా తూర్పు కాలనీకి చెందిన పులిమంతుల మావుళ్ళు, హరిబాబు మాట్లాడుతూ 1989 సంవత్సరంలో తమకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తమకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను ఇవ్వగా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఇళ్ల స్థలాల సేకరణ కోసం తమకు ఇచ్చిన స్థలాలను వెనక్కి తీసుకుని సెంటున్నర స్థలాలను తమకు ఇచ్చారని వారు తెలిపారు. స్థలాలను వెనక్కి తీసుకునేటప్పుడు కాలనీలలో రహదారులు నిర్మించి మౌలిక వసతులను కల్పిస్తామని అప్పటి తహసిల్దార్ ఆకుల కృష్ణ జ్యోతి తమకు హామీ ఇచ్చారని ఆ హామీ నేటికీ నెరవేరలేదని వారు వాపోయారు. జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు చేపట్టాలని పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తున్నారని ఆ ప్రచారాలు కేవలం ప్రచారం గానే ఉన్నా యని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నాయకులు తక్షణమే స్పందించి తమ కాలనీకి కనీస అవసరా లైన విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ సౌకర్యం, గ్రావెల్ రహదారులు వేయించాలని వారు వేడుకుంటున్నారు.

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం

విశాలాంధ్ర - కలిదిండి : దేహదారుఢ్యమునకు మానసిక ప్రశాంతతకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని పడమటిపాలెం ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ కు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేటి యువత వీడియో గేమ్స్ కు ఫోన్లకు అలవాటు పడి క్రీడలు ఆడేవారు తగ్గుముఖం పడుతున్న ఈ తరుణంలో క్రీడలను ప్రోత్సహిస్తూ ఈ వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ సాన మీనా సరస్వతి, ఏఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పంతం సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - పెద్దాపురం : దివంగత మాజీ మంత్రి వర్యులు పంతం పద్మనాభం మెట్ట ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని పెద్దాపురం జడ్పీటిసి గవరసాని సూరిబాబు, వైసీపీ నాయకులు పల్లా గంగారావు, గంటా రామస్వామి, తదితరులు అన్నారు. పంతం పద్మనాభం 24వ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని కాండ్రకోట గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మెట్ట ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే కాకుండా, నాడు ఎంతోమంది యువతకు ఉపాధి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోకా నానాజీ, గవరసాని రాజశేఖర్, ఎంపీటీసీ భద్రరావు, ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరస్వామి, ఒబిలిశెట్టి వెంకటేశ్వర్లు, లక్కాకుల కృష్ణ అధిక సంఖ్యలో పద్మనాభం అభిమానులు పాల్గొని పద్మనాభం విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు

ఐఎస్టిఎస్‌లో స్లమ్ డాగ్ హస్బెండ్ సందడి

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని తూర్పు గొనగుడెంలోని ఐఎస్టిఎస్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల లో స్లమ్ డాగ్ హస్బెండ్ చిత్ర బృందం బుధవారం సందడి చేసింది. ఈ సందర్భంగా చిత్ర హీరో సంజయ్ (బ్రహ్మాజీ సన్)మాట్లాడుతూ మంచి కామెడీతో యువతకి నచ్చే విధంగా తమ సినిమా ఉంటుంద న్నారు. చిత్రాన్ని ప్రతిఒక్కరు ఆదరించి థియేటర్స్ లో సినిమా చూడాలని కోరారు.సినిమా లో సాంగ్స్ కి హీరోయిన్,కళాశాల విద్యార్థులతో పాటు డాన్స్ లు వేశారు.హీరోయిన్ ప్రణవి మానుకొండ మాట్లాడుతూ గోదావరి అందాలు బాగున్నాయని ప్రమోషన్ కి ఉమెన్స్ కాలేజ్ కి రావడం ఆనందంగా ఉందని అన్నారు.జబర్దస్త్ ఫేమ్ యాదమ్మ రాజు తనదైన శైలిలో కామెడీ డైలాగ్స్ చెప్పి అందరినీ నవ్వించి, స్టూడెంట్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రిలయన్స్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ నిర్మించబడ్డ స్లమ్ డాగ్ హస్బెండ్ జూలై 21న విడుదల అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కే. ఉపేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీ, ఈక్బాల్, కళాశాల సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టేకి యూనియన్ బ్యాంక్‌లో అప్‌లైజర్ పోస్టు ఖాళీ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి యూనియన్ బ్యాంకులో అప్రైజర్ పోస్ట్ ఖాళీగా ఉన్నది. అనుభవజ్ఞులు పోస్టుకు అప్లై చేసుకోవాల్సిందిగా టేకి యూనియన్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు. విద్యార్హత పదవ తరగతి పాస్ అయి ఉండాలి. గోల్డ్ షాప్‌లో ఐదు సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలి. వయసు 30 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలు కలిగి ఉండాలి. ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఇద్దరు ష్యూర్టిగా కలిగి ఉండాలి. దరఖాస్తులు ముగింపు తేదీ ఈనెల 20వతేదీ సాయంకాలం నాలుగు గంటలు లోపు అప్లికేషన్లు తీసుకోనున్నారు.

ఎస్ఈబి దాడుల్లో 2.5 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ఒరిస్సా రాష్ట్రం నుంచి వివిధ మార్గాల ద్వారా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు గంజాయి చేరవేస్తున్నారనే సమాచారం మేరకు డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలో మరియు అన్ని ఎస్ఈబి స్టేషన్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రత్యేక పోలీస్ బృందాల సహాయంతో గంజాయి పై దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కొత్తపేట ఎస్ఈబి స్టేషన్ పరిధిలో వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి, ఒక కేసు నమోదు చేసి 4 గురు ముద్దాయి లను అరెస్ట్ చేశారు.

పార్టీ శ్రేయస్సే ముఖ్యం

విశాలాంధ్ర - జగ్గంపేట : సీఎం జగన్మోహన్ రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిని చేసేందుకు నియోజవర్గ వ్యాప్తంగా తిరుగుతూ పార్టీని తాము పటిష్ట పరుస్తున్నామని మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట మండలం మన్యంవారిపాలెంలో తన అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ గతంలో జగ్గంపేట నియోజకవర్గానికి అనేక సేవలు అందించామని, నియోజకవర్గంలోని ప్రజలందరితో సత్సంబంధాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో వెంట ఆయన కుమారుడు తోట రాంజి, అనుచరులు అత్తలూరి సాయిబాబు, రామకుర్తి మూర్తి, ఎస్‌ఏ గఫూర్, తులా రాము, తదితరులు ఉన్నారు.

పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - ఉంద్రాజవరం: గ్రామ వాలంటీర్లుగా గౌరవ వేతనంతో విధులు నిర్వహిస్తున్న తమ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని మండలంలోని పాలంగి గ్రామ వాలంటీర్లు డిమాండ్ చేశారు. వారాహి యాత్ర నిర్వహిస్తూ పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉన్న వలంటీర్స్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వాలంటీర్ల మనోభావాలు దెబ్బతింటాయన్నారు. వెంటనే వాలంటీర్లం దరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉంద్రాజవరం మండలం పాలంగి వాలంటీర్ లు గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

విశాలాంధ్ర - మామిడికుదురు : ఈదరాడ గ్రామంలోని సిద్ధార్థ పేట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్, ఎన్ హరీష్ ఫ్రెండ్స్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకి పుస్తకాలు మరియు పెన్నులు, ఫ్లాంక్స్, పలకలు బహుకరించి తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కుసుమ వనజ కుమారి శ్రీధర్, సర్పంచ్ చుట్టుగుల్ల లక్ష్మీ రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుసుమ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారి- 1 ఎస్ఎస్‌వివి లక్ష్మీ నారాయణ మండల విద్యాశాఖ అధికారి- 11, మోకా వెంకన్న బాబు, ప్రధానోపాధ్యాయ్యులు ఎస్ శ్రీరామ్, సహాయ ఉపాధ్యాయులు షబ్బీర్ హుస్సేన్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వము కల్పిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పిపిసిఎస్ డైరెక్టర్ కుసుమ పెరుమాళ్ కుమార్, బొంతు మణి రాజు, గోసంగి చిన బాపూజీ, యాన్నాబత్తుల చిన్న, కుసుమ శ్రీను, కుసుమ నరేష్, బయ్య నరేష్, బొంతు సత్యనారాయణ, యన్నా బత్తుల రాము, సిఆర్పి నాసర్ మహేదీ, మధుర శ్రీను, కే ప్రసాద్, కుసుమ పెద్దింట్లు, శాంతి, సునీత, వరలక్ష్మి, భాగ్య లక్ష్మి, పేరెంట్స్ కమిటీ సభ్యులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై వాలంటీర్ల చేత అనుచిత వ్యాఖ్యలు చేయిస్తూ, ఆయన దిష్టి బొమ్మలు తగలబెట్టిస్తున్న వైసీపీ నాయకులు, వాలంటీర్ల వైఖరికి జంగారెడ్డిగూడెం మండల,పట్టణ జనసేన పార్టీ నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక కొత్త బస్ స్టాండ్ వద్ద డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి నాయకులు , కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ చింతల పూడి నియోజక వర్గ ఇంఛార్జి మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలకు వక్ర భాష్యాలు తీస్తూ వాలంటీర్లను ఆయన మీదకు ఉసి కొల్పటం , ఆయన దిష్టి బొమ్మలను తగల బెట్టడం చాలా హేయమైన చర్య అని రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉండగా వాటిని పరిష్కరించ లేక ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గోప్యంగ ఉంచవలసిన సమాచారం సేకరించి ప్రజల భద్రత కు తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గురుజు ఉమా మహేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు ఆకుల రాకేష్, మున్సిపల్ కౌన్సిలర్ వలవల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ పీరు,పట్టణ మండల పార్టీ జనసేన కార్యకర్త లు పాల్గొన్నారు.